నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 20 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

కడెం ప్రాజెక్టు

కడెంకు కాంగ్రెస్ షాక్

డ్రిప్ పథకానికి ఎంపిక కాకపోవడంపై విమర్శలు

- నిలిచిన రూ.16 కోట్ల నిధులు.. మరమ్మతులు కష్టమే..
- అనాలోచిత నిర్ణయంతో దాదాపు 20 వేల ఎకరాలకు నీరందని దుస్థితి
- కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరపాలి : రైతులు

నిర్మల్, నవంబర్ 19(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం కారణంగా కడెం ప్రాజెక్టుకు భారీ షాక్ తగిలింది. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతు కోసం రూ.5 కోట్లు మంజూరు చేసింది. డ్రిప్(డ్యాం రిహాబిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు) పథకం కింద రూ.16 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేసి పనులు చేశారు. అసెంబ్లీ ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో అంచనాలు తలకిందులయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 కోట్లను తామే విడుదల చేశామంటూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసుకున్నది. కానీ.. డ్రిప్ కోసం రూపొందించిన రూ.16 కోట్ల ప్రతిపాదనలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం కడెం ప్రాజెక్టును డ్రిప్ పరిధి నుంచి తప్పించింది. కాగా.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కడెం ప్రాజెక్టుతోపాటు గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతు పనుల కోసం అంచనాలు తయారు చేసి అవసరమైన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. దీంతో స్వర్ణ, గడ్డెన్న ప్రాజెక్టులకు డ్రిప్ పథకాన్ని వర్తింపజేస్తూ గ్రీన్‌సిగ్నల్ జారీ చేసింది. కడెంను డ్రిప్ నుంచి మినహాయించడం విమర్శలకు తావిస్తున్నది. స్థానిక అధికారులతోపాటు నీటిపారుదల శాఖ అధికారులు సరైన సమన్వయం చేయకపోవడంతో పక్కన పెట్టినట్లు తెలుస్తున్నది. ఫలితంగా ఐదు కొత్త గేట్ల ఏర్పాటుతోపాటు స్పిల్‌వే, ఇతర మరమ్మతు పనులు జరిగే అవకాశం లేదు. రూ.5 కోట్లతో కొంత మరమ్మతులను పూర్తి చేసిన ప్రస్తుత ప్రభుత్వం.. మిగతా పనుల కోసం ప్రతిపాదనలు రూపొందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన అనాలోచిత నిర్ణయాలను పక్కన పెట్టి కడెం ప్రాజెక్టును డ్రిప్ పరిధిలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

62వేల ఎకరాలకు నష్టం

కడెం ఆయకట్టు 62 వేల ఎకరాలు కాగా.. కేవలం 30 నుంచి 40 వేల ఎకరాలకు మాత్రమే నీరందుతున్నది. మొత్తం 18 గేట్లలో 2,5వ నంబర్ గేట్లు మరమ్మతుకు నోచుకోలేదు. రెండేళ్ల క్రితమే ముప్పు నుంచి బయటపడింది. మరమ్మతులు ఆలస్యం కావడంతో ఆయకట్టుకు సాగునీటి సమస్య ఏర్పడుతున్నది. అప్పటి ప్రభుత్వం తాత్కాలిక చర్యలు చేపట్టి రైతులకు నష్టం వాటిల్లకుండా చూసింది. కాంగ్రెస్ ప్రభుత్వం గేట్లు, కౌంటర్ వేయిటర్ల మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం 'డ్రిప్' పథక నిర్ణయంతో 62వేల ఎకరాలకు సాగు నీరందే అవకాశం ఏర్పడేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందించే పరిస్థితి లేదు.

అదనపు గేట్ల ఏర్పాటుపై నిర్లక్ష్యం

కడెం ప్రాజెక్టుకు ఇప్పుడున్న గేట్లతోపాటు అదనంగా మరో ఐదు గేట్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. వీటిని పట్టించుకోకపోవడం, ఆధునీకరణ కోసం చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుడి, ఎడమ కాలువల ఆధునీకరణపై దృష్టి సారించకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. కాలువల లైనింగ్ చెడిపోవడం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పూర్తి స్థాయిలో పొలాలకు నీటిని అందించలేనిదుస్థితి నెలకున్నది. యేటా వేలాది క్యూసెక్కుల నీరు గోదావరి పాలవుతున్నప్పటికీ.. ఈ నీటిని ఒడిసి పట్టుకునే పరిస్థితి లేకుండాపోయింది. ఇప్పటికైనా అదనపు గేట్లను ఏర్పాటు చేయడమే కాకుండా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి రిజర్వాయర్‌లో నీటిని రక్షించాలని రైతులు కోరుతున్నారు.

గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్టులకు మోక్షం దక్కేనా?

డ్రిప్ పథకం కింద ఎంపిక చేసిన గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందో లేదో అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గడ్డెన్న మరమ్మతు కోసం రూ.18 కోట్లు, స్వర్ణ కోసం రూ.9 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. కరకట్ట నిర్మాణంతోపాటు ప్రస్తుతం ఉన్న గేట్లకు పూర్తిస్థాయి మరమ్మతులు జరిగే అవకాశం ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపితే ఈ నిధులకు మోక్షం లభించే అవకాశం ఉన్నది.

మాట్లాడుతున్న అధికారులు

ఆర్జీయూకేటీలో ఫిజిక్స్‌పై సదస్సు

బాసర, నవంబర్ 19 : బాసర ఆర్జీయూకేటీలో మంగళవారం ఇంజినీరింగ్ ఫిజిక్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఇంజినీరింగ్ విద్యలో ఫిజిక్స్ పాత్ర ప్రధాన భూమిక వహిస్తుందన్నారు. అధ్యాపకులు తమ తమ రంగాల్లో అత్యాధునిక సాంకేతికతతో తమను తాము అప్‌డేట్, అప్‌గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాకేశ్ రోషన్, ఏవో రణధీర్ సాగి, డాక్టర్ దేవరాజు పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లు బంద్

జైనథ్ మార్కెట్ యార్డులో సోయా నిల్వలు

ఆదిలాబాద్, నవంబర్ 19(నమస్తే తెలంగాణ) : జిల్లాలో సోయా రైతులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తున్నది. జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా అక్టోబర్ 5వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభం కాగా.. రైతులు మార్కెట్ యార్డుకు సోయాను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సోయాబిన్‌కు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.4,821 ప్రకటించింది. ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో పంటను విక్రయిస్తున్నారు. జిల్లాలోని ఎనిమిది మార్కెట్ యార్డుల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంటను సేకరిస్తున్నారు. పంట సేకరణ ప్రారంభం నుంచి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పంటలో తేమ, చెత్త ఎక్కువగా ఉందనే నెపంతో కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారు. దీంతో రైతులు పంటను మార్కెట్ యార్డుల్లో ఆరబెట్టడంతోపాటు జల్లెడ పట్టిస్తున్నారు. ఇందుకోసం అదనంగా కూలీలకు చార్జీలు చెల్లించాల్సి వస్తున్నది.

గన్నీ సంచుల కొరత

జిల్లాలో ఇప్పటి వరకు 1,61,763 క్వింటాళ్ల సోయాబిన్‌ను కొనుగోలు చేశారు. రైతు వద్ద నుంచి సేకరించిన సోయాను నిర్వాహకులు గన్నీ సంచుల్లో నింపి గోదాముల్లో భద్రపర్చుతున్నారు. ఒక్కో బ్యాగులో 50 కిలోల సోయాను నింపుతారు. ఇప్పటి వరకు 3,23,527 గన్నీ బ్యాగులను వినియోగించినట్లు అధికారులు అంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత కారణంగా పంట సేకరణ నిలిచిపోతున్నది. జైనథ్ మార్కెట్ యార్డులో గన్నీ సంచుల కొరత కారణంగా మంగళవారం నుంచి కొనుగోలు చేయడం లేదు. మార్కెట్ యార్డులో భారీగా కొనుగోలు చేసిన పంట నిల్వలు పేరుకుపోయాయని, గన్నీ సంచులు లేని కారణంగా కొనుగోలు చేయడం లేదని నిర్వాహకులు అంటున్నారు. జైనథ్ మార్కెట్ యార్డులో మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తమ పంటను విక్రయానికి తీసుకొచ్చారు. తీరా కొనుగోళ్లు లేకపోవడంతో మార్కెట్ యార్డులోని ఉండాల్సిన పరిస్థితి నెలకున్నది. అధికారులు ముందుగా సమాచారం ఇవ్వకపోవడంతో తాము మార్కెట్ యార్డుకు సోయాను తీసుకొచ్చామని, ఇప్పుడు వాహనాలు, కూలీలు కిరాయి తమ అదనంగా చెల్లించాల్సి వస్తున్నదని రైతులు అంటున్నారు. గన్నీ సంచుల సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్కెట్ యార్డు ఎదుట నిలిచిన సోయా వాహనాలు

రైతులను ఇబ్బంది పెట్టవద్దు..

సోయాబిన్ కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. నేను 30 క్వింటాళ్ల సోయాబిన్‌ను విక్రయించడానికి జైనథ్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడికి వచ్చిన తర్వాత తీరా సోయాను రెండు రోజుల వరకు కొనమని చెబుతున్నారు. గన్నీ సంచులు లేకపోవడంతో పంటను సేకరించడం లేదని అంటున్నారు. పంటను కొనమని ముందుగా సమాచారం ఇస్తే తీసుకొచ్చేవాళ్లం కాదు. పంట ఎప్పుడు కొంటారని పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకున్నది. ఇప్పుడు ట్రాక్టర్ కిరాయి, కూలీలకు డబ్బులు ఎక్కువగా చెల్లించాల్సి వస్తున్నది. సంచుల కొరత లేకుండా అధికారులు చూసుకోవాలి.

- నర్సింగ్, రైతు, మాకోడ, జైనథ్ మండలం

బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ వద్ద చలిలో పిల్లాపాపలతో కలిక నేలపై నిద్రిస్తున్న ప్రజలు

ఆధార్ కోసం జాగారం

- రాత్రంతా నిద్రలేకుండా నిరీక్షణ
- కేంద్రం వద్దనే చలిలో కలిక నేలపై పిల్లాపాపలతో నిద్ర
- సొంత మండలంలోనే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి

ఆధార్ కార్డు ప్రతి పనికి కేంద్ర బిందువుగా మారింది. దీంతో ఆధార్ లేనివారు, పొరపాట్లను సరిదిద్దుకోవాలనుకునే వారు నమోదు కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ వద్దకు సోమవారం రాత్రి 11 గంటలకు సిర్పూర్(యు), కెరమెరి, లింగాపూర్, చిన్నదాంపూర్, జాములధర సోనేపూర్, బేతాలగూడ, జెప్రి, మాంజీరి, నార్నూర్ తదితర గ్రామాల నుంచి సుమారు 250 మందికిపైగా పిల్లాపాపలతో కలిసి ఆధార్ నమోదు, ఆధార్‌లోని పొరపాట్లను సరిదిద్దుకునేందుకు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. ఒక్కొక్కరుగా నమోద్ చేసుకోవడంతో అర్ధరాత్రి అయింది. ఆ రాత్రి ఇంటికి వెళ్లలేక సెంటర్ వద్దనే చలిలో పిల్లాపాపలతో కలిసి నిద్రించారు. చలి మంటలు కూడా కాగారు. ఈ సందర్భంగా ఆధార్ నమోదుదారులు మాట్లాడుతూ.. మా మండలంలో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆలస్యంగా చేస్తున్నారని పేర్కొన్నారు. బంధువుల సమాచారం మేరకు బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్‌లో పనులు తొందరగా జరుగుతాయని తెలుసుకుని వచ్చాం. ఆటోకు రూ.500 ఇచ్చి ఇక్కడికి చేరుకున్నాం. మా మండల పరిధిలోనే సమస్యలను తొలిగి పోయేలా చూడాలని వారు వేడుకున్నారు. - బజార్‌హత్నూర్, నవంబర్ 19

మత్తు పదార్థాల నివారణపై దృష్టి సారించాలి..

నేర సమీక్ష నిర్వహించిన ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, నవంబర్ 19 : ఆదిలాబాద్ జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మండలాలవారీగా పోలీసు సిబ్బంది గ్రామాలను సందర్శిస్తూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల ద్వారా కలిగే నష్టాన్ని వివరించి చైతన్యపరచాలని సూచించారు. గ్రామాలను సందర్శించినప్పుడు ప్రస్తుత సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న నవీన పద్ధతులు, 1930 సైబర్ టోల్ ఫ్రీ నంబర్ యొక్క ఉపయోగం, బాధితులు నష్టపోయిన వెంటనే గోల్డెన్ అవర్ సమయంలో ఫిర్యాదు చేయాలని సూచించాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 17 మంది పోలీసు సిబ్బందికి నగదు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, నాగేందర్, బి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- రక్తదాన శిబిరానికి విశేష స్పందన

రక్తదానం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదివాసీ యువత గొప్ప కార్యక్రమాలు చేపట్టాలి

నార్నూర్, నవంబర్ 19 : భవిష్యత్‌లో ఆదివాసీ యువత ముందుండి గొప్ప కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా ఆకాంక్షించారు. గాదిగూడ మండలంలోని ఝరి పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కసారి రక్తదానం చేస్తే ముగ్గురి ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. ఆరోగ్యవంతులైన పురుషులు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం కలెక్టర్ రక్తదానం చేశారు. ఉమ్మడి మండల అభివృద్ధికి దృష్టి సారిస్తామని తెలిపారు. అనంతరం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణను పరిశీలించారు. అలాగే చిన్నకుండి గ్రామంలో నెలకున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి ఆ గ్రామస్తులు తీసుకెళ్లారు. తప్పకుండా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ జైశ్రీరామ్, గాదిగూడ మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్, తహసీల్దార్ విజయనందం, ఎంపీడీవో శ్రీనివాస్, రాయిసెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు పటేల్, జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, సార్‌మెడి మడాడి దౌలత్‌రావు, మాజీ సర్పంచ్ కొడపజాకు, ఉపాధ్యాయుడు మెస్రం శేఖర్‌బాబు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి..

జైనథ్, నవంబర్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒక లక్ష్యంతో చదవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మేడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రామస్తులు విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, తహసీల్దార్ శ్యాం సుందర్, ఎంపీడీవో వెంకట్ రాజ్, ఎంఈవో జి.శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ కె.రాంరెడ్డి, సీడీపీవో సురేఖ, మేడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యవాన్ చిక్టె తదితరులు పాల్గొన్నారు.



పత్తి పండిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో తమ పేర్లు లేవని చూపిస్తున్న పెంబి రైతులు

పత్తికి బదులు వరి

- ఆన్‌లైన్‌లో తప్పగా నమోదు చేసిన ఏఈవో
- దళారులకు అమ్ముకుని నష్టపోతున్న రైతులు
- వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం : వ్యవసాయ అధికారులు

పెంబి, నవంబర్ 19 : పెంబి మండలంలో దాదాపు 1200 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 1000 ఎకరాల్లో పత్తి సాగవుతుంది. కానీ.. స్థానిక ఏఈవో లక్ష్మణ్ 90 శాతం వరి పండిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశాడు. రైతు ఏ పంట పండిస్తున్నాడో తెలుసుకుని ఆన్‌లైలో నమోదు చేయాలి. కానీ.. స్థానిక ఏఈవో తనకు ఇష్టం వచ్చిన పంటను ఆన్‌లైలో నమోదు చేశాడు. దీంతో రైతు చాలా ఇబ్బందులు పడుతున్నాడు. ఆన్‌లైన్‌లో పత్తి పండిస్తున్నట్లు లేకపోవడంతో సీసీఐ పత్తిని కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు దళారుల వద్దకు వెళ్లి మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారు. వ్యవసాయాధికారులను సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో మార్పులు చేయరాదని తెలుపుతున్నారు. మంగళవారం పెంబి రైతులు 'నమస్తే' తెలంగాణాకు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారిని అడుగగా.. ఏఈవో లక్ష్మణ్ కొత్తగా రావడం, సమయం లేక ఆన్‌లైన్‌లో పత్తికి బదులు వరిని నమోదు చేశాడన్నారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో మార్పులు-చేర్పులు చేసి రైతుల ఇబ్బందులను తొలిగిస్తామని తెలిపారు.

పెన్షనర్ల ధర్నా

ఎదులాపురం, నవంబర్ 19 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా.. ఇప్పటివరకు సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్(టీఏపీఆర్‌పీఏ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్షుడు శశికాంత్ మాట్లాడుతూ.. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై విజ్ఞప్తి చేసినా.. ఆందోళనలు నిర్వహించినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పోతుల నారాయణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, సబ్ కమిటీ కన్వీనర్ తూపు రాణి సీతారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జగన్‌మోహన్, కోశాధికారి బాపురావు, గౌరవ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు